కాని నీ జీవితం కుక్కలు చింపిన విస్తరి అని తెలిసిన మరుక్షణం నేను ఎంతగా బాధపడ్డానో చెప్పలేను.

జీవితంలో ఇహ వసంతమెలాగూ తిరిగి రాదు. హేమంత మన్నా సుఖమయం చేసుకో. నువ్వు ప్రేమించేవారిని పొందలేకపోతే కనీసం నిన్ను ప్రేమించేవారికన్న ఆశ్రయం యివ్వు మనస్సుకి సంతృప్తి, ఆత్మకు శాంతి లభిస్తాయి.

పీడకలలాంటి గతాన్ని మరిచిపో ! దాంతోబాటు నన్ను కూడా మరిచిపో !

# స్నిగ్ధ మధురం

"కమలా ! కమలా!" అంటూ శ్యామలరావుగారు బిగ్గరగా పిలుస్తూ లోపలికి వచ్చాడు.

"ఏమిటండీ హడావిడి లాటరీ ప్రైజు ఏమన్నా వచ్చిందా" అంటూ చిరునవ్వుతో అతనివంక చూసింది.

"ఒక్క లాటరీ ఏమిటి పది లాటరీలు ఒక్కసారి వచ్చాయి.

తెలిసేలాగా తెలుగులో చెప్పండి.

"ఈ ఉత్తరం చదువు అన్నీ నీకే తెలుస్తాయి." ఏ విషయం వచ్చినా చిన్నపిల్లవాడిలాగా సంబరపడే భర్తవంక ఒకసారి చూసింది. ఆయన్నిదాటి చూపు యిల్లంతా ఒక్కసారి కలయజూచింది.

భర్తలో వృద్ధాప్యం, ఇంటిలో దారిద్ర్యం!

ఆనాడు, యీనాడు, అనుక్షణం తనకి కనిపించేవి యివే. అందరికి కనిపించేవి కూడా యివే ! కాని బ్రతుకులో ఓడిపోయినా, జీవితంలో ఓడిపోని ఆయన నిత్యానందం, అల్ప సంతోషం తనకు తెలియనివి కావు !! గడ్డిపోచని చూసినా అదే బంగారం అని సంతోషించే అమాయకత్వం ఆయనది!

సమస్త సంపదలు పొందినా సంతృప్తిపడలేని మనస్సు తనది. కాని ఆయన నీడలోవుండి, అనుక్షణం ఆయన జీవితంలోని లేమిని "ప్రతిక్షణం గుర్తుకుతెచ్చి" ఆయనను యీ పాతిక సంవత్సరాలుగా ఆయనను చిత్రవధ చేసినా ఆయన మాత్రం చిరునవ్వు మరిచిపోలేదు. చిద్విలాసానికి దూరంకాలేదు.

"మీ రిద్దరూ పార్వతీ పరమేశ్వరులు" అని యిరుగూ పొరుగూ అన్ననాడు మొదట్లో సంతోషం కలిగింది. కాని కాలం తెచ్చిన మార్పు ఆ మాటని వేళా కోళంగా మార్చింది.

సర్వ సంపదలున్న పర్వత రాజపుత్రికను మగసిరి ఒక్కటే సంపదగా గల శంకరుడు అతను.

తన సర్వస్వాన్ని, తనవారిని, సంఘాన్ని ఎదిరించి త్రోసిరాజనడానికి ఆ రోజున తనకు యౌవనం, కలలుకనే తియ్యటి వయస్సు తన దగ్గరన్నాయి. వయసు కోరిన సుఖం కాదనలేని తను ఆనాడు మనసైన మగవాడి కోసం ఎంత పనైనా చెయ్యగలిగింది. వయస్సు మళ్ళింది. కలలు కరిగిపోయాయి.

తను చేసిన త్యాగం నిరర్ధకమనే నిజం తప్ప ... జీవితం తనకేం మిగల్చలేదు.

మిగిలిందల్లా ప్రేమించిన వాడిమీద నిర్లప్తత, నిర్లక్ష్యం, తప్పుచేసిన అపరాధిలాగా అతను తల వంచుకుని తనఎదుట నిలబడి.

"నిన్ను సుఖపెట్టలేకపోయాను కమలా" అని అన్నప్పుడు తను హేళనగా పోనీ మీరన్నా సుఖపడ్డారుగా అని ఎద్దేవా చేసేది.

"ఇంకెవరైనా అయితే ..."

అది ఇంకొక జన్మలో విషయం ... ఈ జన్మకింతేగా !

అంత నిరాశలోనూ అతను చిరునవ్వు నవ్వేవాడు.

ఆ చిరునవ్వు చూస్తే ఆనాడు తనకు ఆటకట్టు ... కాని ఈనాడు చిరాకు. చిరాకులోను ద్వేషంలోను అతనితోనే కాలం గడిపిందేకాని ఈ బంధం తెంచుకుని ఎక్కడికీ పారిపోలేకపోయింది.

కారణం?

పిరికితనమా?.... లేకపోతే యింకా ఎక్కడో అంతరాళాల్లో దాగిన ప్రేమా?

పిరికితనమా? తనకా? ఈ పిరికితనం మరిచి పోవటానికే ఒకసారి తను ధైర్యం చేసింది.

"కమలా !! ..." శ్యామలరావు కంఠం వినిపించింది.

ఉలిక్కిపడి అటు చూసింది.

"ఉత్తరం చదవ్వేం ?? ..."

శ్యామలరావుగారికి,

రామచంద్రరావు జమిందారుగారి లాయరు విశ్వనాథం రాయునది. జమిందారుగారు మొన్న పదహారవ తారీఖున స్వర్గస్తులైనారని తెలియపరచడానికి విచారిస్తున్నాం ... వారి స్వార్జితం యావత్తూ మీ కుమారుడు రామానికి సర్వ హక్కులతో చెందేలాగా వారు విల్లు రాశారు. తమరు కుర్రవానిని వెంట తీసుకుని ఈ వూరువచ్చి ఆస్తి స్వాధీనం చేసుకోవలసింది.

ఇట్లు,

విశ్వనాథం.

పూర్తిగా చదివావా !! అంటూ శ్యామలరావు కంఠం వినిపించింది. కమల పెద్ద పెట్టున నవ్వింది.

"మిమ్మల్ని ఎవరో బాగా ఏడిపించడానికి ఈ ఉత్తరం రాశారు"

అదేమిటీ !

ఉద్రేకం మాని ఈ ఉత్తరం తీరిగ్గా చదువుకోండి. అందులోవున్న విషయం మీకే అర్థం అవుతుంది.

ఏమంటున్నావు?

తేరగా ఎక్కడిదైనా ముదనష్టం వచ్చి పడాలనే మీ వెర్రి ఆశలు తెలిసిన వాళ్ళెవరో ఈ ఉత్తరం రాశారు.

"నీ మాటలే అర్థం కావటంలేదు."

"ఉత్తరం ఏ వూరినుంచి వచ్చిందో లేదు లాయరుగారి అడ్రసు లేదు. ఈ రెండు విషయాలు అర్థమైతే చాలు. మిగతా నా మాటలేం అర్థం కావలసిన పనిలేదు."

ఇది అబద్ధమే నంటావా !

"లేకపోతే ఎవరో జమిందారు ఆయన ఆస్తినంతా మన అబ్బాయి పేర రాయడం ఏమిటండి! మనమేమన్నా బంధువులమా? సాటి కులస్థులమా!

కమలా ఒక్కమాట చెప్పనా?

ఒక్కటేం కర్మ !! లక్షమాటలు చెప్పండి ...

మీ మాటలు వినడానికేగా నేను యీ భూమి మీద పుట్టింది.

కమలా !!!

"మన బ్రతుకంతా మాటలేగా? అంతకంటే ఏముంది?

శ్యామలరావు ఏం మాట్లాడలేదు వెనక్కి తిరిగాడు.

మాట ఏదో చెబుతానన్నారుగా ...

శ్యామలరావు చిరునవ్వు నవ్వాడు.

"ప్రయోజనం లేని మాటల్లో అదొకటి. చెప్పకుండా వుండడమే మంచిది.

కమల ముఖంలో కోపం కనిపించింది శ్యామలరావు బయటకు వెళ్ళిపోయాడు.

వరండాలో రామం కనిపించాడు.

"రామం" అంటూ ఆయన పిలిచాడు.

రామం మాట్లాడకుండా ఆయనవంక చూశాడు. ఆ చూపులో చిరాకు కనిపిస్తోంది.

అమ్మ దగ్గర ఒక వుత్తరం వుంది. ఒకసారి చదువుకో.

మీరు చదవలేదా !

"నేను చదివాను ... కాని నువ్వు చదువుకుని నీ వుద్దేశ్యం నాకు చెబితే మంచిది.'

ఉత్తరం చదువుకుంటూ కొద్ది క్షణాలలో రామం బయటకు వచ్చాడు. ఆనందం కన్నా అపనమ్మకం అతనిలో ఎక్కువగా కనిపిస్తోంది.

"ప్రాక్టికల్ జోక్ (practical Joke) అని అన్నాడు.

విషయం పూర్తిగా పరిశీలించిన తరువాత ఆ నిర్ణయానికి రావటం మంచిది రామం"

రామం ఏం మాట్లాడలేదు. చిరిగి పోయిన చొక్కా కుట్టువంక చూసుకుంటూ బయటకు వెళ్ళిపోయాడు.

శ్యామలరావు ఆ వుత్తరం మళ్ళీ చదవటం మొదలుపెట్టాడు.

రామచంద్రరావు జమీందారు !! ఈ పేరే తనకు ఎక్కడా అంతుచిక్కటం లేదు. పోస్టు ముద్దర పరిశీలించినా కనబడ్డ పూర్తిపేరు తనకు ఏ విధంగాను పరిచయం వున్న వూరుకాదు.

ఆ వూరిపేరు రామగిరిపాలెం !!

ఏ జిల్లా ?! ఏ తాలుకా !?

కాని తన అడ్రసు మాత్రం యింటి పేరుతో సహా నెంబరుతోసహా కరెక్టుగా రాశాడు. ఎల్లా తెలుసు?

సరాసరి పోష్టాఫీసుకు వెళ్ళి అక్కడ వాకబు చేశాడు. కావలసిన సమాచారం అక్కడ అందింది.

కమలతో యీ విషయం చెబితే నమ్మదు సరికదా పైగా హేళన కూడా చేస్తుంది ... కాని తను వెళ్ళకపోతే ఈ సమస్య యిల్లాగే పరిష్కారం కాకుండా నిలబడిపోతుంది.

ఇంటికి వచ్చేసరికి కమల తనకోసం ఎదురు చూస్తూంది. అతన్ని చూడగానే "ఆచూకీ తెలిసిందా" అని అడిగింది.

"తెలిసింది"

"ఇహనేం వెంటనే వెళ్ళి ఆ ఆస్తినంతా బళ్ళ మీద ఎక్కించి తీసుకురండి".

"నేను వెళ్ళడం లేదు. ప్లీడరు గారినే ఇక్కడికి రమ్మని రాద్దాం. మనుకుంటున్నాను.'

'

ఇక్కడికి రమ్మని రాస్తున్నారా? మీకేమన్నా మతిపోయిందా? ఈ కొంపా గోడు చూసి ఆయనేమనుకుంటాడు.

దీంట్లో దాచుకోవలసింది ఏముంది? ఇంతకంటే తెలివితక్కువతనం యింకా ఏముంటుంది?

ఒక పెద్ద జమీందారు ఆస్తికి వారసుడయ్యే వ్యక్తి యింత బీదవాడని తెలుస్తే వాళ్ళేమనుకుంటారు?"

"మన స్థితిగతులు వాళ్ళకు తెలియవంటావా.

మీతో ఏ విషయం చెప్పినా యింతే !!

"సరే యీ విషయం గురించి చర్చించడం యిహ మానేద్దాం.

మనకు కావలసింది క్రియ. కబుర్లు కాదు రోజు భగవద్గీత పారాయణ చేస్తూ వుంటారుగా దాంట్లో కర్మ సిద్ధాంతం మరిచిపోయారా !

దైవదూషణ మంచిది కాదు కమలా?

"చెంపలు వాయించుకుంటాను గాని రేపు ఉదయమే మీరు అబ్బాయి వెళ్లి ఆ వ్యవహారం పరిష్కారం చేసుకుని రండి ఎవరి జ్ఞాతకం ఎల్లా వుందో !!"

మరునాడు ఉదయం శ్యామలరావుగారు రామం బయలుదేరి జమీందారుగారి వూరు వెళ్ళారు. కమలకు యిదేం పట్టనట్టు కనిపించినా మనస్సు వెయ్యి విధాలుగా పోయింది. ఎప్పుడు లేనిది ఏదో చెప్పలేని ఆందోళనా భయం కలిగాయి.

మనస్సున మార్మోగిన మాట యిందులో ఏదో మోసం వుంది. కాలుగాలిన పిల్లిలాగా ఇల్లంతా కలయతిరిగింది. రెండు రోజులకి తండ్రి కొడుకూ యిద్దరూ తిరిగి వచ్చారు.

రామం మేఘాలమీద నడుస్తున్నాడు. శ్యామలరావు పాతాళంలోకి క్రుంగిపోతున్నాడు. తల్లిని చూడగానే సంతోషంతో రామం ముందుకు వచ్చాడు.

"కాయా? పండా? అని కమల అడిగింది."

"లక్షా మాభైవేల రొక్కం, బెజవాడలో ఒకటి, మదరాసులో ఒకటి. రెండుమేడలు,

ఇంతకంటే ఏం కావాలి? అంటూ రామం చెప్పుకుపోతున్నాడు.

"నిజమేనా?"

నిజమేనామ్మా, ప్లీడరుగారు వాళ్లు మమ్మల్ని ఎంతో గౌరవించారు.

జమీందారీ ఎవరికిచ్చారు?

"ఇప్పుడు జమీందారీలు లేవు కదమ్మా! ఆయన మిగతా ఆస్తులన్నీ మరదలు కొడుక్కి యిచ్చారు. ఆయన స్వార్జితం మాత్రం నాకు యిచ్చారు.

"డబ్బా అది..

అన్ని ఏర్పాట్లు నిన్ననే జరిగిపోయాయి. డబ్బు మనవూళ్ళో బ్యాంకుకి నా పేర ట్రాన్సఫరు చేశారు. ఇళ్ళ అద్దెలు నాకు పంపమని అద్దెకున్న వాళ్ళకి నా ఎదుటనే ఉత్తరం రాశారు.

ఇంకా ఈ వూళ్ళో ఈ అద్దెకొంపలో ఎందుకురా, హాయిగా మదరాసు వెళ్ళిపోదాం...

నేను అదేమాట అన్నానమ్మా.. నాన్నగారు మాత్రం వప్పుకోవటం లేదు.

"ఆయన మాటలకేంలేగాని నువ్వు వెంటనే బయలుదేరి మదరాసు వెళ్ళు. ఆ యిల్లు అదీ ఖాళీ చేయించు. మనం బయలుదేరి మకాం అక్కడికి మార్చివేద్దాం."

రామం సంతోషంగా బయటకు వెళ్ళిపోయాడు.

అల్లా వున్నారేం ! కొడుకు లక్షాధికారి అయ్యాడంటే సంతోషంగా లేదా? సంతోషంగా వుండడం నేర్చుకోండి.

శ్యామలరావు ఏం మాట్లాడకుండా కమల వంక చూస్తూ కూర్చున్నాడు.

"మాట పడిపోయిందేం? డాక్టర్ని పిలవనా?"

శ్యామలరావు ఏం మాట్లాడలేదు. అక్కడ నుంచి వెళ్ళిపోయి దొడ్లో ఒక్కడూ కూర్చున్నాడు.

కమలకు అంతులేని కోపం కలిగింది. సరాసరి అతని దగ్గరకు వెళ్ళి నిలబడింది.

"ఏమండి!" అంటూ గర్జించింది.

అతను ఉలిక్కిపడి కమలవంక చూశాడు... కళ్ళల్లో కన్నీరు.

ఇప్పుడే మొచ్చిందని ఏడుపు !

"ఆనందభాష్పాలు కమలా?"

అవాక్కటే మన బ్రతుక్కి తక్కువ. ! ! !

శ్యామలరావు నిలువునా వణికిపోతున్నాడు. ముఖం కోపంతో జేవురించింది. ఫెళ్లున లెంపకాయ కొట్టాడు.

ఆ దెబ్బకు కమల అదిరిపోయింది. కలలో కూడా ఊహించలేనిది ఈనాడు జరిగింది. తనని కొట్టేటంత మొనగాడయ్యాడా?

"నా కళ్ళ ఎదుట కనిపించకు అని శాశించాడు.

నిర్ఘాంతపోయి ఆయనవంక చూసింది ఏదో చెబుదామని అనుకుంది కాని మాట్లాడకుండా అక్కడనుంచి వెళ్ళిపోయింది. జీవితంలో ఎన్నడూ జరగనిది ఈనాడు

జరిగింది. ఆయన్ను చూస్తే తనకు భయం వేసింది... ఈ యిరవై అయిదు సంవత్సరాలలో ఎన్నడు కూడా భర్తగా తనమీద అధికారం చెలాయించలేదు. ఎన్నడూ తనని కించపరచలేదు. తనే ఎన్నిరకాల అవమానాలు చేసినా చిరునవ్వుతోనే సహించడం ఆయన తత్వం. అటువంటి వ్యక్తి ఈనాడు యిల్లా మారిపోయాడేం?

ఏమో! ఈ మగవాళ్ళ మనసులు ఎవరికి అర్థం కావు వెళ్ళి క్షమార్పణ చెప్పుకుంటే ? ... తను చేసిన పొరబాటేముంది. ఇప్పటికే చాలా చులకన అయ్యాం.

మదరాసు వెళ్ళేరోజున శ్యామలరావుని బ్రతిమాలింది. "చిన్న పిల్లలలాగా మనకు ఈ ప్రణయ కలహాలు ఏమిటండి !" రండి ! హాయిగా మదరాసు వెళ్ళివుందాం.

మదరాసులో నాకు ఏముంది?

మన ఆస్తి.

మన ఆస్తి అని అనకు... ఆస్తికి హక్కుదారుడు అబ్బాయి. ఆ వారసుడికి కన్నతల్లివి నువ్వు. మీ యిద్దరికి ఉన్న హక్కు నాకు ఎక్కడ వుంటుంది ? ?

"అర్థమైయ్యేలాగా మాట్లాడండి ... మొన్న లాయరుగారు కలిసినప్పుడు నేను చెప్పిన విషయం వాకబు చేశారా!"

ఏమిటది?

మన రామానికే ఈ ఆస్తిని ఎందుకు యిచ్చారో?

శ్యామలరావు నవ్వడానికి ప్రయత్నం చేశాడు. తమ వాళ్ళకు, వాళ్ల ఆస్తి యివ్వడంలో ఆశ్చర్యం ఏముంది?

అంటే?

జీవితంలో అన్ని విషయాలు తెలియక పోవడంలోనే సుఖం ఉంది కమలా !!

ఎందుకని?

నిజం నిప్పులాంటిది కమలా! అనవసరంగా దీన్ని ముట్టుకుని చేతులు కాల్చుకోవటం దేనికి?

మనిషిలాగా మాట్లాడండి.

మనిషిలాగా బ్రతకడం నేర్చుకొని ... అప్పుడు మనిషిలాగా మాట్లాడుతాను.

మరునాడు రామం వెంట కమల మదరాసు వెళ్ళిపోయింది. వెళ్లిన మూడవరోజున కమల దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది.

ఏమండి !

క్షమించమని అడగడానికి కూడా నాకు అర్హతలేదని నాకు తెలుసు .. కాని... ఇంతకాలం మీ హృదయంలో చోటు యిచ్చి నన్ను గౌరవించారు కాని ఈనాడు నేను ప్రార్థించేదెల్లా ఒకటే. మీ పాదాల దగ్గర రవ్వంత చోటు యివ్వండి. నన్ను పూజించ నక్కర్లేదు .. ఆదరించండి చాలు.

మన తరం అయిపోయింది. జీవితం ప్రొద్దు వాటారిపోతోంది. చివరి రోజులన్నా ప్రశాంతంగా జరిగిపోతే చాలు.

రామం చిన్నవాడు ఎవరి వాడైతేనేం మన ఇద్దరికి కావలసిన వాడు. ఇంతకాలం వాడిని ప్రాణం కన్నా ఎక్కువగా ప్రేమించాం.

అజ్ఞానంలో నేను చేసిన పొరబాటుకు రామం జీవితం నాశనం చేసే ఆ వ్యక్తులు మీరు కారనే నమ్మకమే యీ ఉత్తరానికి కారణం.

మీరు మదరాసు వచ్చి రామం దగ్గర వుంటే నన్ను క్షమించినట్టు నేను నమ్ముతాను.కమల.

ఉత్తరానికి కమలకు సమాధానం త్వరగానే వచ్చింది. "రామానికి ఏలోటు లేకుండా చెయ్యడమే యింతవరకూ నా లక్ష్య నా ప్రయాస ... ఈనాడు ఆ సమస్య తేలికగానే పరిష్కారం అయింది. నువ్వన్నట్టుగానే జీవితం ప్రొద్దువాటారింది. ఈ సాయం సంధ్యలో మిగిలిన రవ్వంత కాలం, దైవ చింతనలో గడుపుదామనే ఆశతో దూరంగా వెళ్ళిపోతున్నాను, మనస్సుకి మళీ మాయ కమ్మిన నాడు తిరిగి వస్తానేమో !

నా నిర్ణయం మార్చడానికి ఎవరు చేసే ప్రయత్నమైనా వ్యర్థమే. శ్యామలరావు.

కమల ఆ వుత్తరం చదువుకుని, కన్నీరు నిండిన కళ్ళతోనే చిరునవ్వు నవ్వింది.

అమ్మా? అంటూ రామం పిలిచాడు.

ఏం నాయనా? అని కమల అన్నది.

లాయరుగారు మొన్న ఏమన్నారో తెలుసా అమ్మా"

ఏమన్నారు?

జమిందారుగారు, నావయస్సులో వున్నప్పుడు అచ్చంగా నా లాగానే వుండే వారటమ్మా !! నిజమేనా అమ్మా!

కమల ఏం మాట్లాడలేదు. రామం ప్రశ్నకు సమాధానం యివ్వలేదు.

మేడమీద గదిలో జమిందారుగారి ఫోటో దగ్గరకు వెళ్ళి నిలబడింది. ఫోటో లోంచి ఆ వ్యక్తి గంభీరంగా యీవిడవంక చూస్తున్నాడు.

కమల మనస్సులో వెయ్యి తుఫానులు ఒక్కసారి రేకెత్తాయి.

మన యిద్దరిమధ్యనే ఉండవలసిన రహస్యాన్ని యిల్లా బట్టబయలు చేస్తావా?

మనస్సు యిచ్చానుకాని శరీరాన్ని అమ్ముకోలేదే?

ఆరోజున కాలేజీలో చదువుకోవడానికి వచ్చిన పేద విద్యార్థిలాగా నటించావు.

కోరికలని అణుచుకని అదుపులో పెట్టుకోవడం చాతకాని నన్ను నీ చూపులతో కొల్లగొట్టుకున్నావు. నిన్ను జయిస్తున్నానని, వశపరుచుకుంటున్నానని అపోహపడుతూనే నన్ను నేను నీకు అర్పించుకున్నాను.

చీకటిలో కలిశావు. చీకటిలోనే మాయమయ్యావు. చీకటిలో నా వ్రేలికి నువ్వు తొడిగిన ఉంగరం పెట్టెలో అట్టడుగున ఎవ్వరికీ కనిపించకుండా దాచాను. కాని మన ప్రణయానికి స్మృతి చిహ్నాన్ని నేను ఎవరినుంచి దాచలేకపోయాను. విని ఆనందించవలసిన వాడివి నువ్వు ఎక్కడున్నావో తెలియదు.

కాని నన్ను ప్రాణంకన్నా ఎక్కువగా ప్రేమించి, గౌరవించే ఆయనకు నేను చేసిన ద్రోహం ఆనాడు ద్రోహంలాగా కనిపించలేదు. ఏదో ఘనవిజయం సాధించినట్టు భావించాను.

ఆయన నన్ను ఎంత ఆదరణగా చూసేవారో నేను చెప్పలేను నిజం చెప్పి, ఆయన ఆనందాన్ని నాశనం చెయ్యలేక ఈ రహస్యాన్ని నాలోనే దాచుకున్నాను.

కాలం అన్ని మార్పులని తెచ్చింది, రామం మా ఇద్దరి సంతానమేనని నేనుకూడా నమ్మేస్థితిలోకి వచ్చాను.

కాని నువ్వు ఈ కలని చెదరగొట్టావు... నీ మట్టుకు నువ్వు ఆస్తి యివ్వటం అన్యాయం అని ఎవ్వరూ అనరు. కాని ఒక్కొక్కసారి దైవం యిచ్చేవరం కూడా అర్హతలేనివారికి శాపంగా మారుతుంది.

రామానికి ఈ రహస్యం తెలియక పూర్వమే ఈ అవతారం చాలించే ధైర్యం నాకు ప్రసాదించు.

కన్నులు మూతబడుతున్నాయి. కలలు చేరువవుతున్నాయి... తియ్యని వెలుగేదో చల్లగా ఆత్మను తాకుతోంది... వెలుగు మాయమయింది. చీకటి చేరువయింది. శబ్దం నిశ్శబ్దంలో లీనమై పోయింది.

రాత్రి రెండు గంటలని గడియారం గంట కొట్టింది. సినిమానుంచి తిరిగివచ్చిన రామం. తల్లిని నిద్ర మేల్కొలపడానికి వ్యర్థ ప్రయత్నాలు చేస్తూనే వున్నాడు.

# మంచుతెర

**మా**వూరి రాములవారి గుడి వెనకాల పూలతోటలో పట్టపగలే- దయ్యాలు తిరుగాడుతాయని వూళ్ళో జనాభాయావత్తూ ప్రతి ఒక్కడూ స్వయంగా వెళ్ళి చూచి వచ్చినంత ఖచ్చితంగా ఒకళ్ళకు తెలియకుండా ఒకళ్ళు చెప్పడం మొదలు పెట్టారు. అందరిమాటా ఎల్లావున్నా ఆవుల మాలక్ష్మికి కనబడ్డవాడు మాత్రం దయ్యం అనడానికి వీలులేదు, వాడు రూపాయికి పదహారు అణాలు బ్రహ్మరాక్షసి అని అది వూరంతా చెప్పివేసింది. ఊళ్ళో వాళ్ళు కాదనలేదు. బ్రహ్మరాక్షసి అనగానే అది ఎవరో మావూళ్ళోవాళ్ళకు వెంటనే అర్థమయింది. మునసబునాయుడు కొడుకు ధర్మయ్య యమధర్మరాజు సవితి తమ్ముడంటే కాదని అనేవాళ్ళు ఎవరూలేరు. అంతేకాదు మునసబునాయుడుకూడా వాళ్ళ పక్షమే. బుచ్చయ్యకు మనువు ఏర్పాటయిన ఆవుల మాలక్ష్మి అంటే మునసబు నాయుడి కొడుక్కి వల్లమాలిన వ్యామోహం అది కంటబడితేనే కబళించి వేద్దామన్నంత ఆకలి అని అంతా అంటారు.

ఆ రోజున అన్నీ అలానే వొనగూడినాయి. మనం ఎన్నిసార్లు అడిగినా చెప్పదు కాని, మిట్టమధ్యాహ్నం ఊరికి దూరంగా వున్న చిట్టడివికి మాలక్ష్మి వెళ్ళవలసిన పనేమిటి ? అదేవేళకు ఎవరో చెప్పినట్టుగా మునసబునాయుడు కొడుకుకూడా అక్కడకు రావలసిన కారణం ఏమిటో అది యీనాటికీ ఎవరికి తెలియదు. చక్కగా తలదువ్వి పువ్వులు పెట్టుకుని యింట్లోంచి బయటకు వెళ్ళిన మాలక్ష్మి జుట్టంతా రేగిపోయి బట్టలు మట్టి కొట్టుకుని పోయి ఏడుస్తూ యింటికి తిరిగివచ్చేసరికి, చెప్పకుండానే దానికథ వూళ్ళో వాళ్ళందరికీ అర్థమయింది. ఏడి ? మునసబునాయుడి కొడుకు ? వాణ్ణి చంపుతాం నరుకుతాం అంటూ బాకులు బరిసెలు పుచ్చుకుని ఊళ్ళో అశేషజనం గుడివెనకాల చిట్టడివికి